బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 27 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

# దీపావళి కానుకగా ఇందిరమ్మ ఇండ్లు

- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డీఏ
- సమ్మక్క సారలమ్మ గిరిజన వర్శిటీకి 211 ఎకరాల భూమి
- కోర్టుల్లో ఉద్యోగాల భర్తీకి ఆమోదం
- కేబినెట్ భేటీ వివరాలు వెల్లడించిన మంత్రులు

## ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మొదటి విడతగా 3500 ఇళ్ల మంజూరు.





**బలగం టీవీ, హైదరాబాద్**

దీపావళి పండుగ వేళ తెలంగాణ ప్రభుత్వం పేదలు, ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ, పెండింగ్ డీఏల విడుదలపై కీలక ప్రకటన చేసింది. శనివారం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో కేబినెట్ భేటీ జరిగింది. దాదాపు నాలుగు గంటలు పాటు సుదీర్ఘంగా జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. కేబినెట్ భేటీ ముగిసిన అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ మంత్రి మండలి నిర్ణయాలను వెల్లడించారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డీఏ ఇవ్వాలని మంత్రిమండలి నిర్ణయించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని దీపావళి పండుగ సందర్భంగా ఒక డీఏను విడుదల చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. మెట్రో రైలు మార్గాల విస్తరణకు కేబినెట్ ఆమోదం తెలిపిందని.. నాగోల్–ఎల్బీ నగర్– హయత్ నగర్ వరకు.. ఎల్బీ నగర్ నుండి శంషాబాద్ వరకు మెట్రో విస్తరిస్తామని వెల్లడించారు. నాగోల్ - శంషాబాద్, రాయదుర్గం - కోకాపేట్, ఎంజీబీఎస్ - చాంద్రాయణగుట్ట, మియాపూర్ - పటాన్ చెరు, ఎల్ బీ నగర్ –గహయత్ నగర్ మొత్తం 76.4 కిలోమీటర్ల మేరకు విస్తరణ చేపట్టాలని మంత్రిమండలి నిర్ణయించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్య విధానంలో చేపట్టే మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టు కోసం రూ. 24,269 కోట్లతో ప్రతిపాదనలతో సిద్ధం చేసిన డీపీఆర్‌ను కేంద్రానికి నివేదించాలన్నారు.

జీవో 317 కు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం సిఫారసుల మేరకు ఉద్యోగుల మెడికల్, స్పౌజ్, మ్యూచువల్ బదిలీలకు ఆమోదం. జీవో 46 కు సంబంధించి కీలకమైన స్థానికత అంశం రాష్ట్రపతి పరిధిలో ఉన్నందున న్యాయ సలహా తీసుకుని శాసనసభలో చర్చించిన తర్వాత నిర్ణయం అన్నారు.

రాష్ట్రంలో నవంబర్ 30 వరకు కుల, ఆర్థిక, సామాజిక గణన సర్వే పూర్తి చేయాలి. ఇందుకోసం 80 వేల మంది ఎన్యుమరేటర్లను నియమించి నవంబర్ 4 నుంచి 19 వరకు రాష్ట్రమంతా ఇంటింటి సర్వే చేపడుతారని చెప్పారు.

రాష్ట్రంలో పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ పరిధిలో చేపట్టాల్సిన రోడ్ల నిర్మాణానికి దాదాపు రూ. 25 నుంచి 28 వేల కోట్లు అవసరమని అంచనా వేయగా పీపీపీ విధానంలో పూర్తి చేయడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవన నిర్మాణానికి గోషా మహల్ లో పోలీసు శాఖ పరిధిలోని స్థలాన్ని వైద్య శాఖకు బదిలీ.

ములుగులో ప్రతిపాదిత గిరిజన విశ్వవిద్యాలయానికి 211 ఎకరాల స్థలం కేటాయింపు. గచ్చిబౌలీ స్టేడియాన్ని ప్రతిపాదిత యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి బదలాయింపు. మధిర, వికారాబాద్, హుజూర్ నగర్ ఏటీసీల ఏర్పాటు, కావలసిన పోస్టుల మంజూరు.

దీపావళి కానుకగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మొదటి విడతగా 3500 ఇళ్ల మంజూరు. రాష్ట్రంలో ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో స్టోరేజీ కెపాసిటీ తగ్గిపోతున్న కారణంగా వాటిల్లో స్టిల్ట్ తొలగించాలని నిర్ణయం. పైలట్ ప్రాజెక్టుగా మొదట కడెం ప్రాజెక్టులో స్టిల్ట్ తొలగింపు. గత ప్రభుత్వ హయాంలో రైస్ మిల్లర్ల వద్ద పేరుకుపోయిన దాదాపు రూ. 20 వేల కోట్ల విలువైన ధాన్యం క్లియరెన్స్ కు సంబంధించి సబ్ కమిటీ సమర్పించిన నివేదికకు ఆమోదం. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కోర్టుల్లో ఉద్యోగాల భర్తీకి ఆమోదం తెలిపిందని వెల్లడించారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక యాప్

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించినట్లు రాష్ట్ర దేవాదాయ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని, రాజకీయ పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక కోసం రూపొందించిన యాప్‌ను శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి పరిశీలించారు. ఈ యాప్‌లో ఒకటి రెండు మార్పులు చేయాలని మంత్రి సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు యాప్‌లో కొన్ని మార్పులు చేసి వచ్చే వారం రోజుల్లో యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

## ప్రభుత్వ అనుమతులున్న భవనాలను హైడ్రా కూల్చదు : కమిషనర్



**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రభుత్వ అనుమతులున్న భవనాలను హైడ్రా కూల్చదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. హైడ్రా ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు హైడ్రా ముందుకు సాగుతుందన్నారు. సర్వే నంబర్లు మార్చి తప్పుడు సమాచారంతో అనుమతులు తీసుకొని భూములు, చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై హైడ్రా చర్యలు తప్పకుండా ఉంటాయని తెలిపారు. అలాగే హైడ్రా కూల్చివేతల తర్వాత ఆ వ్యర్థాలను సదరు బిల్డరే తొలగించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని సూచించారు. ఇప్పటికే ఈ విషయంలో పలువురు బిల్డర్లు, యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కొంతమంది నిర్మాణ వ్యర్థాలను తొలగిస్తుండగా మరికొంత మంది అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆయన మండిపడ్డారు. అలాగే భవన నిర్మాణాల వ్యర్థాల తొలగింపు ప్రక్రియను పూర్తిగా టెండర్ల ద్వారానే పిలిచి అప్పగించామని, ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లోని వ్యర్థాల్లో ఇనుప చువ్వల తరలింపుపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని ఖండించారు. నగరంలో ట్రాఫిక్, వరద నీటి సమస్య పరిష్కారానికి కూడా హైడ్రా చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు.

మరోవైపు నగరంలోని దాదాపు 100 చెరువుల్లో ఆక్రమణలు తొలగించి, సుందరీకరణ చేసి పర్యాటక ప్రదేశాలుగా మార్చాలని హైడ్రా నిర్ణయించింది. ఈ మేరకు కొన్ని చెరువులను సీఎస్ఆర్ పథకం కింద, మరికొన్నిహెచ్ఎండీఏ సొంత నిధులతో పర్యాటక ప్రదేశాలుగా చేయనున్నారు. ఆక్రమణలు తొలగించడమే కాకుండా సుందరీకరణ చేస్తే ప్రయోజనాలు ఉంటాయని యోచిస్తున్నారు. చెరువుల సుందరీకరణకు సంబంధించిన జాబితాను ఇప్పటికే రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్‌కు ఇచ్చారు. పూడికతీతతో పాటు చుట్టూ పచ్చదనం పెంచి పర్యాటక ప్రాంతాలుగా మార్చేలా ప్రణాళికలు రూపొందించారు. బెంగళూరు తరహాలో చెరువులకు పునరుజ్జీవం పోయాలని అధికారులు యోచిస్తున్నారు. చెట్ల పరిరక్షణతో పాటు ప్రధాన రహదారులు, కాలనీల్లో ప్రమాదకరంగా ఉన్న చెట్లను సైతం వెంటనే తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా మారుతున్న చెట్ల కొమ్మలను తొలగించాలని, ఇంకా ఇబ్బందిగా ఉంటే ఆ చెట్లను ట్రాన్స్ లొకేట్ చేయాలని రంగనాథ్ నిర్ణయించారు.

## తెల్లబోతున్న తెల్లబంగారం..



**బలగం టీవీ, హైదరాబాద్**

తెల్లబంగారం తెల్లబోతున్నదని, రైతు ఆగమైతుంటే ప్రభుత్వం పత్తాలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బోనస్ దేవుడెరుగు, మద్దతు ధరకే దిక్కులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. దళారుల చేతిలో పత్తి రైతు చిత్తవుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ కొర్రీలు పెట్టి, సాకులు చూపెట్టి కొనుగోళ్లు నిలిపివేసిందన్నారు. క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని రైతు డిక్లరేషన్‌లో చెప్పి, ఇప్పుడు ఉలుకూ పలుకూ లేకుండా కాంగ్రెస్ సర్కారు కూర్చున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వరి తర్వాత రెండో అతిపెద్ద పంటైన పత్తి కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చొరవ లేదు, శ్రద్ధలేదని మండిపడ్డారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్న బుద్ధిలేదని విమర్శించారు. ఇప్పటికే దొడ్డు వడ్లకు బోనస్ ఎగ్గొట్టి దగా చేశారని, సన్నాలకు షరతులు పెట్టి కొర్రీలు వేస్తున్నారని చెప్పారు. ఇప్పుడు పత్తి రైతును కూడా చిత్తు చేస్తున్నారని దుయ్యబట్టారు. కర్షక ద్రోహి కాంగ్రెస్ అని, రైతు డిక్లరేషన్ ఒక బోగస్ అని చెప్పారు..

## తిరుమలలో సిఫార్సు లేఖలను అప్పుడే స్వీకరిస్తాం

- ఏపీ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభా

**బలగం టీవీ, హైదరాబాద్**

తిరుమలలో టీటీడీకి కొత్త బోర్డును నియమించిన తరువాతే తెలంగాణ నుంచి వచ్చే అన్ని సిఫార్సు లేఖలను స్వీకరిస్తామని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. శనివారం యాదాద్రిలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని ఆయన దర్శించుకున్నారు. ఆయనకు ఈవో భాస్కర్ రావు, ఆలయ సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం లడ్డు ప్రసాదం, స్వామి వారి చిత్ర పటాన్ని ఆలయ ఈఓ భాస్కర్ రావు అందజేశారు. తిరుమల తరువాత చాలా మంది భక్తులు దర్శించుకునే యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి అని, మంత్రి హోదాలో దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని వాసంశెట్టి సుభాష్ అన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు.

## ఇంటి వద్దకే ఆర్టీసీ కార్గో సేవలు




**బలగం టీవీ, హైదరాబాద్**

ఇంటి వద్దకే టీజీఎస్ఆర్టీసీ కార్గో సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లో పైలట్ ప్రాజెక్ట్‌గా పార్శిళ్ల హోం డెలివరీని ఆదివారం నుంచి ప్రారంభించనున్నట్లు చెప్పారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా హోం డెలివరీ సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. ప్రత్యామ్నయ ఆదాయాన్ని పెంచుకునేందుకు గాను లాజిస్టిక్స్(కార్గో) సేవలను టీజీఎస్ఆర్టీసీ మరింతగా విస్తరిస్తోందని, అందులో భాగంగానే రాజధాని హైదరాబాద్‌లో వేగవంతమైన సేవలను అందించేందుకు హోం డెలివరీ సౌకర్యాన్ని తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆదివారం నుంచి హైదరాబాద్‌లోని 31 ప్రాంతాల నుంచి హోం డెలివరీ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ సెంటర్స్ నుంచి హైదరాబాద్?లో ఎక్కడికైనా హోం డెలివరీ చేయవచ్చని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇంటి నుంచి ఇంటి వరకు సేవలు అందించేలా లాజిస్టిక్స్ విభాగాన్ని టీజీఎస్ఆర్టీసీ అభివృద్ధి చేస్తోందని తెలిపారు. హోం డెలివరీని సద్వినియోగించుకోవాలని మంత్రి కోరారు.

**పార్శిళ్ల హోం డెలివరీ చార్జీలివే..**
0 నుంచి 1 కేజీ పార్శిల్‌కు రూ.50
1.01నుంచి 5 కేజీలకు రూ.60
5.01 నుంచి 10 కేజీలకు రూ.65
10.1 నుంచి 20 కేజీలకు రూ.70
20.1 నుంచి 30 కేజీలకు రూ.75
30.1 కేజీలు దాటితే పైన పేర్కొన్న స్లాబ్‌ల ఆధారంగా ధరలు ఉంటాయి.



## స్కిల్స్ వర్సిటీకి మెఘా సంస్థ రూ. 200 కోట్ల విరాళం

- భవనాల నిర్మాణాలపై ప్రభుత్వంతో ఎంవోయూ
- నవంబర్ 8 నుంచి పనులు

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ యువతను ప్రపంచంలోనే అత్యుత్తమ నైపుణ్యం కలిగిన వారిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవన నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వానికి మెఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ కి మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. మేఘా కంపెనీ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల నుంచి మొత్తం యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయించింది. వీటితో క్యాంపస్‌లో అవసరమైన అన్ని భవనాలను నిర్మించే బాధ్యతను యూనివర్సిటీ తీసుకుంది. ప్రపంచ స్థాయి అధునాతన మోడల్స్‌తో కూడిన అన్ని మౌలిక సదుపాయాలతో స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణాన్ని చేపట్టేందుకు కంపెనీ ముందుకు వచ్చింది.

శనివారం సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మెఘా కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి నేతృత్వంలో ఆ కంపెనీ ప్రతినిధుల బృందం సంప్రదింపులు జరిపింది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వం తలపెట్టిన స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణంలో భాగస్వామ్యం పంచుకునేందుకు మెఘా కంపెనీ చర్చలు జరిపింది. స్కిల్స్ యూనివర్సిటీ క్యాంపస్ భవనాల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వంతో యూనివర్సిటీ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. కాగా, సీఎస్ఆర్ నిధులతో ఈ క్యాంపస్ నిర్మాణానికి మెఘా కంపెనీ ముందుకు వచ్చినందుకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. అకడమిక్ భవనం, వర్క్ షాపులు, తరగతి గదులతో పాటు హాస్టల్ భవనాన్ని నిర్మిస్తామని మేఘా కంపెనీ ఎండీ కృష్ణా రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఆర్కిటెక్ట్ నిపుణులు రూపొందించిన యూనివర్సిటీ భవన నమూనాలు, డిజైన్లను ఈ సమావేశంలో ప్రదర్శించారు.

వారం రోజుల్లోగా భవన డిజైన్లకు తుది రూపు ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. నవంబర్ 8వ తేదీ నుంచి యూనివర్సిటీ భవన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం తరఫున అందుకు అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

## ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని కానిస్టేబుళ్ళ ధర్నా



- పలు ప్రాంతాల్లో కానిస్టేబుళ్ల భార్యలు నిరసన

**బలగం టీవీ, హైదరాబాద్**


పని భారం తగ్గించాలంటూ వరంగల్ జిల్లా వరంగల్ మండలం మామునూర్ 4ఫోర్త్ బెటాలియన్ కానిస్టేబుల్స్ శనివారం ఆందోళన చేశారు. ఏక్ పోలీస్ కావాలంటూ ప్రధాన గేటు వద్దకు చేరుకొని నినాదాలు చేశారు. 8 గంటలకు మించి పనిచేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి పోలీసు ఉద్యోగస్తులకు పనిభారం తగ్గించి ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డెక్కిన బెటాలియన్ కానిస్టేబుల్స్ భార్యలు

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో పోలీసు కానిస్టేబుల్ కుటుంబ సభ్యుల రాస్తారోకో ఉద్రిక్తతకు దారితీసింది. రాష్ట్రమంతా ఒకే పోలీస్ విధానం అమలు చేయాలంటూ ఇబ్రహీంపట్నంలోని నాగార్జున సాగర్ హైవేపై కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు నిరసనకు దిగారు. దీంతో పెద్దఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో పోలీసులు వారిని అక్కడిని తరలించేందుకు యత్నించగా తోపులాట చోటుచేసుకున్నది. అనంతరం వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

నల్లగొండలోని అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో సిబ్బంది మరోసారి ఆందోళన దిగారు. నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబును సస్పెండ్ చేయాలని సిబ్బంది డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. నాలుగు రోజుల క్రితం ఆందోళన చేస్తున్న తమతో పాటు తమ కుటుంబ సభ్యుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారంటూ సిబ్బంది ఆరోపించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున నినాదాలు చేస్తూ బెటాలియన్ నుంచి రోడ్డుపైకి ర్యాలీగా వస్తున్న సిబ్బందిని పోలీసులు అడ్డుకున్నారు. గేట్లు వేయడంతో సిబ్బంది బయటకు రాకుండా ఆగిపోయారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని 17వ బెటాలియన్ కమాండెంట్ ఆఫీస్ దగ్గర పోలీసులు నిరసన, ధర్నాకు దిగారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. తమకు డ్యూటీలు వేసి కుటుంబాన్ని దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఒకే పోలీసు విధానం ఉండాలని డిమాండ్ చేశారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రంలో ఉన్న పోలీస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. తమతో కూలీ పనులు, చెత్త ఏరే పనులు, మట్టి పనులు చేయిస్తున్నారన్నారు. అలాగే, పెద్ద అధికారుల ఇళ్లలో పాచి పనులు, బొల్లు తోమడం, ఇళ్లు ఊడవడం, పిల్లలను స్కూల్ కి పంపడం, మందు తాగి పబ్బులో పడిపోతే తీసుకురావడంలో లాంటి వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు. వరంగల్‌లోని మామునూరు ఫోర్త్ బెటాలియన్ కానిస్టేబుల్స్ ఆందోళనకు దిగారు. బెటాలియన్ కమాండెంట్ ఆఫీస్ ముందు బైఠాయించారు. ఒకే పోలీస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు.


పూజారుల (వడ్డెలు) సంఘం
శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర, మేడారం
శ్రీ సమ్మక్క - సారలమ్మ (తాడ్వాయి) మండలం,
ములుగు జిల్లా, తెలంగాణ రాష్ట్రం,
రిజిష్టర్ నెం: 22
సిద్దబోయిన జగ్గారావు, అధ్యక్షులు (పూజారుల సంఘం), సెల్: 94410 02258
చందా గోపాలరావు, కార్యదర్శి (పూజారుల సంఘం), సెల్: 94947 52076
తేది: 26.10.2024

# మేడారం మినీ జాతర తేదీలు ఖరారు !

%దేశంలోనే ప్రసిద్ధి చెందిన ఆదివాసీ గిరిజన జాతరగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడారం జాతర పేరొందింది. ఈ జాతరకు దేశంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. కాగా, 2025 సంవత్సరానికి సంబంధించి మేడారం మినీ జాతర తేదీలను సమ్మక్క-సారలమ్మ పూజారులు ప్రకటించారు. 2025 ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు అర్చకులు మినీ జాతర నిర్వహిస్తారు. మినీ మేడారం జాతరలో అమ్మవార్లను గద్దెలపైకి తీసుకరారు. గద్దెల వద్ద పూజారులు ప్రత్యేక పూజలు చేస్తారు. జాతర కావడంతో ఇక నాలుగు రోజుల పాటు మేడారం పరిసరాలు కోలాహలంగా మారనున్నాయి. జంపన్న వాగులో స్నానాలాచరించి అమ్మవార్లని దర్శించుకుని బంగారాన్ని కానుకగా సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. కాగా, మేడారం మహాజాతర రెండేళ్లకోసారి జరుగుతుందన్న సంగతి తెలిసిందే.



# పోటీ కొత్తేమో.. పోరాటం కొత్త కాదు

- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ

బలగం టీవీ, హైదరాబాద్

వాయ నాడ్ ఉప ఎన్నిక పోరుకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ సిద్ధమవుతున్నారు. ఇటీవలే ఈ లోక్‌సభ స్థానం నుంచి ఆమె నామినేషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా వాయనాడ్ నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి ఓ భావోద్వేగభరిత పోస్ట్ చేశారు. " తాను ఎన్నికల్లో పోటీకి కొత్తేమో గానీ.. ప్రజల తరఫున పోరాటం కొత్త కాదని" తెలిపారు. "కొన్ని నెలల క్రితం నేను, మా సోదరుడు రాహుల్‌తో కలిసి మండక్కై, చూరాల్‌మల్ వెళ్లాను. కొండచరియలు విరిగిపడటంతో ప్రకతి సష్టించిన బీభత్సం కారణంగా మీరు ఎదుర్కొన్న నష్టాన్ని, సర్వం కోల్పోయిన మీ ఆవేదనను కళ్లారా చూశా. పిల్లలను కోల్పోయిన తల్లులు, కుటుంబాన్ని కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులను చూశా. ఆ చీకటి రోజుల నుంచి బయటపడి నవశక్తితో మీరు ముందుకు కదిలిన తీరు స్ఫూర్తిదాయకం. నిస్సహాయ స్థితిలోనూ తోటి వారి కోసం మీరు పడిన ఆరాటం.. మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం. ఆ విషాద సమయంలో మీరు చూపించిన అచంచలమైన ధైర్య సాహసాలే.. ఈరోజు నాలో స్ఫూర్తిని నింపాయి. మీ తరఫున పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నా" అని పేర్కొన్నారు. "నా సోదరుడికి మీరు ఎంతో ప్రేమను, అభిమానాన్ని పంచారు. అదే ప్రేమను నాపైనా కురిపిస్తారని ఆశిస్తున్నా. చట్టసభలో మీ గళాన్ని వినిపించే అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నా. చిన్నారుల భావి భవిష్యత్తు, మహిళల శ్రేయస్సు కోసం నా శక్తికి మించి కృషి చేస్తానని మాటిస్తున్నా. ప్రజాప్రతినిధిగా పోటీ చేసే ఈ ప్రయాణం నాకు కొత్త కావొచ్చు. కానీ, ప్రజల తరఫున గళం వినిపించేందుకు చేసే పోరాటం మాత్రం కొత్త కాదు. ఈ ప్రయాణంలో మీరంతా నాకు మార్గదర్శకంగా నిలుస్తారని ఆశిస్తున్నా" అని ప్రియాంకా గాంధీ రాసుకొచ్చారు.

# దండుపాళ్యం బ్యాచ్‌లా తయారైన బీఆర్ఎస్ సోషల్ మీడియా



బలగం టీవీ, హైదరాబాద్

బీఆర్ఎస్ సోషల్ మీడియా ఓ దండుపాళ్యం బ్యాచ్‌లా తయారైందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి అన్నారు.తాను అనని మాటలను అన్నట్లుగా ట్రోలింగ్ చేస్తే లీగల్ నోటీసులు ఇస్తానని హెచ్చరించారు. తనను ఇష్టారీతిన ట్రోలింగ్ చేస్తున్న వారు తనకు దొరికితే బహిరంగంగానే బట్టలు ఊడదీసి కొడతానని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తనపై, సీఎంపై, ఇతర కాంగ్రెస్ నేతలపై చేస్తున్న ట్రోలింగ్ పట్ల ఆయన తీవ్రంగా స్పందించారు. ఇటీవల కొంతమంది సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రుల మీద కూడా సోషల్ మీడియా వేదికగా అవాకులు, చెవాకులు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నాయకుల ప్రసంగాలను ఇష్టారీతిన ఎడిట్ చేసి ట్రోలింగ్ చేస్తున్నారని ఆరోపించారు.

తాను ఓ మహిళా కలెక్టర్‌ను బూతులు తిట్టినట్లు సోషల్ మీడియాలో దారుణమైన పోస్టులు పెడుతున్నారన్నారు. కానీ తాను ఏ కలెక్టర్‌నూ దూషించలేదని జగ్గారెడ్డి వివరణ ఇచ్చారు. సోషల్ మీడియాలో తమపై జరుగుతున్న ప్రచారం సరికాదన్నారు.



# రికార్డు స్థాయిలో 'పుష్ప2' విడుదల..!

- 11,500 స్క్రీన్లలో విడుదలకు సన్నాహాలు

బలగం టీవీ, హైదరాబాద్

ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్, బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ సెన్సేషనల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఇండియన్ ఫిలిం 'పుష్ప-2'. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్‌పై అభిరుచి గల నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్.. సుకుమార్ రైటింగ్స్ అసోసియేషన్‌తో కలిసి నిర్మిస్తున్నారు. డిసెంబరు 5న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు తెలియజేశారు నిర్మాతలు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన మరో సెన్సేషనల్ న్యూస్‌ను వెల్లడించారు మేకర్స్. పుష్ప -2 చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఆరు భాషల్లో కలిపి 11,500 స్క్రీన్స్‌ల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లుగా తెలిపారు మేకర్స్. ఇండియాలో 6500 స్క్రీన్స్‌ల్లో, ఓవర్సీస్‌లో 5000 స్క్రీన్స్‌ల్లో గ్రాండ్‌గా విడుదలకు ప్లాన్ చేస్తున్నామని తెలిపారు నిర్మాతలు. అయితే ఇది బిగ్గెస్ట్ రిలీజ్ ఇండియన్ సినిమాగా ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటి వరకు ఏ ఇండియన్ సినిమా కూడా ఇలాంటి ఘనత సాధించలేదని అంటున్నాయి ఇండియన్ ఫిల్మ్ సర్కిల్స్. ఇక పుష్ప-2 బాక్సాఫీస్ రూల్‌లో కలెక్షన్ల పరంగా బాక్సీఫీస్ వద్ద ఎన్నో సంచలనాలు కూడా సృష్టిస్తుందని అంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు.



# 'కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యేల చేరికలు ఆగలేదు'

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యేల చేరికలు ఆగలేదని, కేటీఆర్‌కు అత్యంత సన్నిహితులు తమతో టచ్‌లో ఉన్నారని తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ఈమేరకు పార్టీ చేరికలపై స్పందించారు. పాత.. కొత్త నాయకత్వం సమన్వయం చేసుకుని పనిచేయాలన్న మహేశ్‌కుమార్ గౌడ్, కొంతమంది ఎమ్మెల్యేలను డీసీసీ అధ్యక్షులుగా నియమిస్తామని తెలిపారు. కొత్త పీసీసీ కార్యవర్గం ఏర్పాటుకు కొంత సమయం పడుతుందని అన్నారు.మరోవైపు బీఆర్ఎస్ పార్టీ తీరు, గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని కేటీఆర్ చేసిన తప్పులకు పదేళ్ల జైలు కూడా తక్కువేనని అన్నారు. నిరసనల పేరిట మాజీమంత్రి హరీశ్‌రావు, కేటీఆర్‌లు ప్రజల్ని రెచ్చగొడుతున్నారని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. అన్ని పార్టీల ఎన్నికల అజెండాల్లోనూ మూసీ ప్రక్షాళ ఉందని, మూసీ పరివాహకంలో ఇప్పటివరకు ఒక్క పేదవాడి ఇళ్లు కూడా కూల్చలేదని ఆయన వివరించారు. ఈ విషయంలో విపక్షాలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయని తీవ్రంగా మండిపడ్డారు.

: దేశ రాజధాని దిల్లీ పర్యటనలో భాగంగా ఇద్దరు కాంగ్రెస్ అగ్రనేతలతో టీపీసీసీ చీఫ్? మహేశ్ కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. శుక్రవారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కలిసిన మహేశ్ కుమార్ గౌడ్, తాజాగా ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలతో మర్యాద పూర్వకంగా కలిశారు. ఏఐసీసీ అధ్యక్ష బాధ్యతలు తీసుకుని రెండేళ్లు పూర్తి కావడంతో, ఖర్గేకి శుభాకాంక్షలు తెలిపారు.ఇదే సమయంలో.. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కూడా మర్యాద పూర్వకంగా మహేశ్ కుమార్ గౌడ్ కలిశారు. కాసేపు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రాహుల్ దృష్టికి తీసుకెళ్లినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీపరంగా తాను ఎన్నికయిన 50 రోజులపాటు జరిగిన పలు ముఖ్యమైన అంశాలను కూడా రాహుల్‌కు వివరించారని పీసీసీ వర్గాలు పేర్కొన్నాయి.



# ఫౌజీ' సెట్‌లోకి ప్రభాస్..!

బలగం టీవీ, హైదరాబాద్

ప్రభాస్ ఒకే టైమ్‌లో రెండు మూడు సినిమాలను కానిచ్చేస్తున్న సంగతి తెలిసిందే. మొన్నటిదాకా 'రాజా సాబ్' షూటింగ్‌లో బిజీబిజీగా గడిపారు ప్రభాస్. ఇప్పుడు ఆ సినిమాకు కాస్త గ్యాప్ ఇచ్చి, 'ఫౌజీ' సెట్‌లోకి అడుగుపెట్టారట. హను రాఘవపూడి డైరెక్షన్‌లో పీరియాడిక్ వార్ అండ్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్నది. పీరియాడిక్ వార్ సీన్స్‌ని ప్రస్తుతం ప్రభాస్‌పై చిత్రీకరిస్తున్నారని సినీ సర్కిల్స్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. ఈ షెడ్యూల్ 20 రోజులపాటు జరుగుతుందట. ఇమాన్వి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. విశాల్ చంద్రశేఖర్ సంగీత దర్శకుడు.

**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రాణహిత నదిలో శనివారం ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. బెజ్జూరు మండలం ఎర్రబండరేవు వద్ద ప్రాణహిత నదిలో ఐదుగురు స్నేహితులు ఈతకు వెళ్లారు. అయితే నదిలో ఈతకు వెళ్లిన ఐదుగురిలో ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. వీరు గల్లంతైనట్లు స్నేహితులు కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.**

# పరిశ్రమల అనుమతులు సకాలంలో పూర్తి చేయాలి



**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

పరిశ్రమల ఏర్పాటుకు అనుమతుల విషయంలో జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో పరిశ్రమల, ఆయా శాఖల ఉన్నతాధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా డీఏపీసీ- టీఎస్ ఐ పాస్, టీ ప్రైడ్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటిదాకా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? అనుమతి కోసం ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి?. ఏ ఏ కారణాలతో నిలిచిపోయాయో ఆయా శాఖల ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. డీఏపీసీ- టీఎస్ ఐ పాస్ కింద పీసీబీ -2, సెస్, ఫ్యాక్టరీస్, నీటి పారుదల శాఖ వద్ద ఒక్కో అప్లికేషన్ పెండింగ్ లో ఉన్నట్లు కలెక్టర్ దృష్టికి జీఎం ఇండస్ట్రీస్ గణేష్ రాం తీసుకెళ్లారు.

**టీ ప్రైడ్ కింద..**

టీ ప్రైడ్ కింద ఎస్సీ లకు 21, ఎస్టీలకు 19, దివ్యాంగులకు ఒకటి, పావలా వడ్డీ కింద 2 యూనిట్స్ మంజూరయ్యాయని జీఎం ఇండస్ట్రీస్ గణేష్ రాం తెలిపారు. ఈ సమావేశంలో ఇండస్ట్రీస్ ఏడీ భారతి, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, ఎల్డీఎం మల్లికార్జున్, జిల్లా ఇరిగేషన్ అధికారి అమరేందర్ రెడ్డి, సెస్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, డీటీసీపీఓ అన్సార్, లేబర్ ఆఫీసర్ నజీర్ అహ్మద్, డీటీడీఓ జనార్ధన్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేయండి.. వారిపాలిట దేవుళ్ళుగా మారండి



**- ఎస్పీ అఖిల్ మహాజన్**

**- జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా రక్త దాన శిబిరం..**

**బలగటివి ,రాజన్న సిరిసిల్ల:**

అమరవీరులు సమాజం కోసం, దేశం కోసం, రేపటి తరాల మంచి భవిష్యత్తు కోసం ప్రాణత్యాగాలు చేశారని వారి త్యాగాలను వెలకట్టలేమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం పోలీస్ అమరవీరుల సంస్కరణ వారోత్సవాల్లో భాగంగా( సిరిసిల్ల పట్టణ పరిధిలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల,కరీంనగర్, మంచిర్యాల,వరంగల్ రెడ్ క్రాస్ సొసైటి వారి సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిధిలుగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.సుమారుగా 650 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది, యువత పాల్గొని రక్తదానం చేయగా,రక్తదానం చెసిన వారికి ప్రశంస పత్రలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ అందించి అభినందించినారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ అమరుల త్యాగ ఫలంగానే ఈరోజు ప్రజలందరూ శాంతియుతంగా, ప్రశాంతంగా ఉన్నారన్నారు.రక్త దానం చేయడం అనేది ఒక సామాజిక సేవా కార్యక్రమం అని, క్లిష్ట పరిస్థితులల్లో ,ఉన్నప్పుడూ ఆపదలో ఉన్న ప్రాణాలు రక్షించడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇటువంటి సామాజిక సేవలలో పాల్గొని తోటి వారి ప్రాణాలను కాపాడటములో తమవంతు సహాయము గా రక్త దానం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహజన్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్కరణ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి పెద్ద సంఖ్యలో యువకులు ముందుకు వచ్చి ఉత్సాహంగా పాల్గొనడం అభినందించ దగ్గ విషయం అని ,విధి నిర్వహణనే లక్ష్యంగా ప్రాణత్యాగం చేసి అమరులైన పోలీసులను ఈ సమాజం ఎప్పటికీ మరువదని, వారి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహించడం జరుగుతుందని అన్నారు .ప్రజల ధన మాన ప్రాణాలను కాపాడుతూ సంఘవిద్రోహ శక్తుల చేతుల్లో బలైన అమర పోలీసులు వీరులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు రెగ్యులర్ పోలీసింగ్ తో పాటు ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకునేందుకు,రాష్ట్రంలో ఉన్న ఎంతోమంది తలసేమియా, సికిల్ సెల్ అనీమియా,డెంగ్యూ వ్యాధిగ్రస్తులకు రక్తం చాలా అవసరం వారికి సహాయం కోసం అమరవిరుల స్మరకర్థం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సుమారు 600 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది,జిల్లాలోని యువకులు పాల్గొని విజయవంతం చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ లు, ఆర్ఐ లు,ఎస్ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.





# పారదర్శకంగా టీచర్ల సర్దుబాటు..

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల సర్దుబాటు పారదర్శకంగా చేపట్టామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. జిల్లాలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 111, ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 39, ప్రాథమిక పాఠశాలలు 330 ఉండగా,కొన్ని పాఠశాలల్లో టీచర్ల కొరత ఉంది. దీంతో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 252 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు శనివారం కౌన్సిలింగ్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై సర్దుబాటు ప్రక్రియను పరిశీలించారు.

అనంతరం ఆయా పాఠశాలల వివరాలు పరిశీలిస్తూ.. ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఆయా పాఠశాలలకు కేటాయించిన ఉపాధ్యాయులు విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతి విద్యార్థి పోటీ పరీక్షలలో విజయం సాధించేలా శిక్షణ ఇవ్వాలని ఆకాంక్షించారు. వృత్తి నిబద్ధత పాటిస్తూ ముందుకు సాగాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఈఓ రమేష్ కుమార్, ఎంఈఓలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఓయూ పరిధిలో వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. దూరవిద్య ద్వారా అందించే అడ్వాన్స్డ్ డిప్లొమా ఇన్ బయో ఇన్ఫర్మేటిక్స్, అడ్వాన్స్డ్ డిప్లొమా ఇన్ మ్యాథ్స్/ఈఎల్టీ/బీఎం, డిప్లొమా, అడ్వాన్స్డ్ పీజీ డిప్లొమా ఇన్ వేదిక్ ఆస్ట్రాలజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలను వచ్చే నెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

# తెలంగాణ పాలిట దండుపాళ్యం ముఠాలా మారిన సీఎం సోదరులు

**- ఎమ్మెల్యే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవీ , హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు తెలంగాణ పాలిట దండుపాళ్యం ముఠాలా మారారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. న్యాయవాది భూములకే సీఎం సోదరులు ఎసరు పెట్టినట్లు వార్తలు వచ్చాయని కేటీఆర్ తెలిపారు. బాధిత వ్యక్తి న్యాయం కోసం పోలీసుల వద్దకు వెళ్తే.. సీఎం సోదరులతో సెటిల్ చేసుకోమని చెబుతారా..? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్నది పోలీసులా? రేవంత్ ప్రైవేట్ సైన్యమా? న్యాయవాదికే న్యాయం దక్కకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటి..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఓ వైపు రాష్ట్రంలో ఉన్న సోదరులకు తెలంగాణ ఆస్తులను దోచి పెడుతూ.. మరోవైపు అమెరికాలో తమ్ముడి కంపెనీతో 1000 కోట్ల ఒప్పందంతో ఏం సందేశం ఇస్తున్నట్లు..? అని నిలదీశారు. రాకేష్ రెడ్డి తండ్రి సుదీర్ఘకాలం కాంగ్రెస్‌లో పని చేసినందుకు మీరు ఆ కుటుంబానికి ఇచ్చిన బహుమానం ఇదేనా..? అని కేటీఆర్ అడిగారు.

# పోలీసు కుటుంబాలు రోడ్డెక్కడం చరిత్రలోనే మొదటిసారి..

**- ఎమ్మెల్యే సిబితా ఇంద్రారెడ్డి**

**బలగం టీవీ , హైదరాబాద్**

ఏక్ పోలీసు విధానం అమలు చేయాలని కోరుతూ.. పోలీసు కుటుంబాలు రోడ్డెక్కడం చరిత్రలోనే ఇది మొదటిసారి అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. కానిస్టేబుళ్ళ కుటుంబాలు రోడ్డు మీదకు రావటానికి సీఎం రేవంత్ రెడ్డినే కారణమని ఆమె మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడారు. హోంశాఖ నిర్వహిస్తోన్న రేవంత్ ఫెయిల్ అవ్వటం వల్లే పోలీస్ కుటుంబాలు బయటకు వచ్చాయన్నారు. రక్షక భటులే న్యాయం కావాలని రోడ్డు ఎక్కటం బాధాకరమన్నారు. ప్రజాపాలన అంటే ఇదేనా రేవంత్ రెడ్డి..? అని నిలదీశారు. రాష్ట్రానికి హోంమంత్రి లేకపోవటం వలన.. కానిస్టేబుల్స్ బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. యూనిఫాం వేసుకుని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి తెలంగాణలో వచ్చిందన్నారు. అయినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడం దారుణమని ఎమ్మెల్యే మండిపడ్డారు.ఏక్ పోలీస్ వ్యవస్థపై సీఎం రేవంత్ మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 15 రోజులకు 4 రోజులు కుటుంబంతో గడిపే పాత పద్ధతిని కొనసాగించాలి. పిల్లలు కూడా తండ్రులను గుర్తుపట్టని పరిస్థితులు పోలీస్ కుటుంబాలవి అని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై అఘాయిత్యాలు రాష్ట్రంలో సర్వసాధారణంగా మారాయి. డీజీపీ స్థాయి అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# రెండో టెస్టూ పాయే..

## సిరీస్ కైవసం చేసుకున్న న్యూజిలాండ్



**బలగం టీవీ, పుణే**

న్యూజిలాండ్‌తో రెండో టెస్టులోనూ టీమ్ఇండియా ఓడింది. పుణె వేదికగా జరిగిన మ్యాచ్‌లో కివీస్ 112 పరుగుల తేడాతో నెగ్గింది. 359 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన టీమ్ఇండియా 245 వద్ద ఆలౌటైంది. యంగ్ బ్యాటర్ యశస్వీ జైస్వాల్ (77 పరుగులు), రవీంద్ర జడేజా (42) రాణించగా మిగితా బ్యాటర్లు విఫలమయ్యారు. దాంతో భారత జట్టు ఓడింది. మూడు టెస్టుల సిరీస్‌ను న్యూజిలాండ్ మరో మ్యాచ్ మిగిలుండగానే దక్కించుకుంది.

మూడో రోజు ఓవర్‌నైట్ స్కోర్ 198-5తో ఇన్నింగ్స్ ఆరంభించిన న్యూజిలాండ్‌ను జడేజా దెబ్బ కొట్టాడు. టామ్ బ్లండెల్ (41)ను ఔట్ చేసి వికెట్ల పతనానికి నాంది పలికాడు. సాంట్నర్(4), అజాజ్ పటేల్(1)లను జడ్డూ ఔట్ చేయడంతో కివీస్ 255 పరుగులకు ఆలౌటయ్యింది. అనంతరం భారత బ్యాటర్లు మిచెల్ సాంట్నర్(6/106)ను ఎదుర్కోలేక వరుసగా డగౌట్ చేరారు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్(77) హాఫ్ సెంచరీతో రాణించగా.. రోహిత్ శర్మ(8), విరాట్ కోహ్లీ(17), పంత్(0), సర్ఫరాజ్ ఖాన్(9)లు తీవ్రంగా నిరాశపరిచారు.

ప్రధాన ఆటగాళ్లంతా పెవిలియన్ చేరినాఅశ్విన్(18)తో కలిసి రవీంద్ర జడేజా(42) కివీస్ బౌలర్లకు పరీక్ష పెట్టాడు. ఈ జోడీ చక్కగా ఆడుతూ ఆశలు రేపింది. అయితే.. సాంట్నర్ ఊరించే బంతితో అశ్విన్ ఆట కట్టించాడు. ఆ తర్వాత ఆకాశ్ దీప్(1) అండగా జడ్డూ 23 పరుగులు జోడించాడు. అయితే.. అజాజ్ పటేల్ బౌలింగ్‌లో అనవసర షాట్ ఆడిన ఆకాశ్.. మిడాన్‌లో రవీంద్ర చేతికి చిక్కాడు. బుమ్రా కాసేపు మెరుపులు మెరిపించినా.. అజాజ్ బౌలింగ్‌లో జడేజా భారీ షాట్ ఆడబోయి బౌండరీ వద్ద సౌథీకి క్యాచ్ ఇచ్చాడు. అంతే.. భారత్ 245 పరుగులకే చాప చుట్టేసింది.

# ఇంగ్లండ్‌పై పాకిస్థాన్ విజయం



**బలగం టీవీ, రావల్పిండి**

సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరిగిన మూడు టెస్ట్‌ల సిరీస్‌ను పాకిస్థాన్ 2-1తో కైవసం చేసుకుంది. రావల్పిండి వేదికగా శనివారం ముగిసిన మూడో టెస్ట్‌లో పాకిస్థాన్ 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 36 పరుగుల లక్ష్యాన్ని 3.1 ఓవర్లలోనే వికెట్ నష్టానికి ఛేధించింది. పాక్ గెలుపులో ఆ జట్టు స్పిన్నర్లు ప్రధాన పాత్ర పోషించారు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ కోల్పోయిన 20 వికెట్లను పాక్ స్పిన్నర్లే పడగొట్టడం విశేషం.

మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 267 పరుగులకు ఆలౌటైంది. బెన్ డకెట్ (52), జేమీ స్మిత్ (89) అర్ధ సెంచరీలతో రాణించారు. పాక్ బౌలర్లలో సాజిద్ ఖాన్ 6, నౌమన్ అలీ 3, జహీద్ మెహమూద్ ఓ వికెట్ పడగొట్టారు.అనంతరం బరిలోకి దిగిన పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 344 పరుగులకు ఆలౌటైంది. సౌద్ షకీల్ సూపర్ సెంచరీతో (134) పాక్‌కు గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. ఆఖర్లో నౌమన్ అలీ (45), సాజిద్ ఖాన్ (48 నాటౌట్) ఓ మోస్తరు ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకున్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో రెహాన్ అహ్మద్ 4, షోయబ్ బషీర్ 3, అట్కిన్సన్ 2, జాక్ లీచ్ ఓ వికెట్ పడగొట్టారు.77 పరుగులు వెనుకపడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్.. పాక్ బౌలర్లు నౌమన్ అలీ (6/42), సాజిద్ ఖాన్ (4/69) దెబ్బకు 112 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో జో రూట్ (33) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.అనంతరం 36 పరుగుల నామమాత్రపు లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన పాక్.. 3.1 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి విజయతీరాలకు చేరింది.

# ఝార్ఖండ్ ఎన్నికల బ్రాండ్ అంబాసిడర్‌గా ధోనీ



**బలగం టీవీ, హైదరాబాద్**

త్వరలో జరగనున్న ఝార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఎన్నికలకు బ్రాండ్ అంబాసిడర్‌గా భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ వ్యవహరించనున్నారు. ఈ విషయాన్ని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ రవికుమార్ తెలిపారు."అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమంలో తన ఫొటోను ఈసీ వినియోగించుకునేందుకు ధోనీ అంగీకరించారు. ఇతర వివరాలపై త్వరలోనే ఆయనతో సంప్రదింపులు జరుపుతాము. ఓటర్లలో ఓటుహక్కుపై చైతన్యం కలిగించేందుకు మహీ కృషి చేస్తారని భావిస్తున్నాం" అని ఆయన వెల్లడించారు.

కాగా, ఓటర్లలో అవగాహన పెంచేందుకు స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలోనే ధోనీ కృషి చేయనున్నారు.




# న్యూజిలాండ్ మెరుగైన ప్రదర్శన చేసింది.

- **రోహిత్ శర్మ**

**బలగం టీవీ, పుణే**

న్యూజిలాండ్ తమకంటే మెరుగైన ప్రదర్శన చేసిందని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ప్రశంసించాడు. రెండో టెస్టులో ఓటమి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

'ఈ ఓటమి తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇది మేం ఏ మాత్రం ఊహించని ఫలితం. న్యూజిలాండ్ మా కంటే మెరుగైన ప్రదర్శన చేసింది. ఈ మ్యాచ్‌లో ఎదురైన సవాళ్లను అధిగమించడంలో మేం విఫలమయ్యాం. దాంతోనే ఓటమిపాలయ్యాం. బ్యాటింగ్‌లో మేం మెరుగైన ప్రదర్శన చేయలేదు. స్కోర్ బోర్డుపై కావాల్సిన పరుగులు ఉంచలేదు. బౌలర్లు 20 వికెట్లు తీయాలంటే... బ్యాటర్లు కూడా బోర్డుపై కావాల్సిన పరుగులు పెట్టాలి. ఈ విషయంలో మేం విఫలమయ్యాం. తొలి ఇన్నింగ్స్‌లో 100 పరుగుల ఆధిక్యాన్ని సమర్పించుకున్నాం. ఇలాంటి పరిస్థితుల నుంచి పుంజుకునేందుకు మేం పోరాడాం. కానీ ఇది ఛాలెంజింగ్‌గా ఉంటుంది. ఈ లక్ష్యాన్ని మేం ఛేధించాలనుకున్నాం. కానీ ఈ క్రమంలో ఎదురైన సవాళ్లను ఎదుర్కోలేకపోయాం. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్‌ను 200/3 నుంచి 259 పరుగులకే పరిమితం చేయడం గొప్ప విషయం. మేం సరిగ్గా బ్యాటింగ్ చేయలేదు. న్యూజిలాండ్ మా కంటే మెరుగ్గా ఆడింది. డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్ గురించి ఆలోచించడం లేదు. వాంఖడే టెస్ట్ గెలవాలనుకుంటున్నాం. ఈ సిరీస్ ఓటమి సమష్టి వైఫల్యం. ప్రత్యర్థి విసిరిన సవాళ్లను స్వీకరించడంలో మా జట్టు విఫలమైంది.'అని అన్నారు.

# వార్నర్‌పై లైఫ్ టైమ్ కెప్టెన్సీ బ్యాన్ ఎత్తివేత

**బలగం టీవీ, హైదరాబాద్**



ఆస్ట్రేలియా డాషింగ్ క్రికెటర్ డేవిడ్ వార్నర్‌కు ఊరట లభించింది. 2018 సాండ్‌పేపర్ గేట్ వివాదంలో వార్నర్‌పై ఇన్ని రోజులుగా ఉన్న లైఫ్‌టైమ్ కెప్టెన్సీ, లీడర్‌షిప్ నిషేధాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) తాజాగా ఎత్తివేసింది. ముగ్గురు సభ్యులతో కూడిన స్వతంత్ర ప్యానెల్ శుక్రవారం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే ఈ నెల మొదట్లో ప్యానెల్ ముందు విచారణకు హాజరైన వార్నర్..నిర్దేశిత ప్రమాణాలు అందుకున్నాడని భావించి సస్పెన్షన్ ఎత్తివేసినట్లు తెలుస్తున్నది. ఇప్పటికే వన్డే కెరీర్‌కు వీడ్కోలు పలికిన వార్నర్..ఆసీస్ తరఫున టీ20ల్లో ఆడుతున్నాడు.